అణగారిన జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం 09 మార్చి 2023

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని కొన్ని ప్రాంతాలలో గురువారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడిఈ తోట రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ మాన్‌సూన్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా ట్రీ కటింగ్స్, ఇన్సులేటర్స్ రీప్లేస్‌మెంట్, జంపర్స్ రీప్లేస్మెంట్‌లో భాగంగా నిజామాబాద్ టౌన్ 2 సబ్ డివిజన్ పరిధిలో ఉదయం 7 గంటల 30 నిమిషాల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. అదే విధంగా డి2 సెక్షన్ పరిధిలో ప్రగతి నగర్, సోనీ ఫంక్షన్ హాల్, ఆర్టీసీ కాలనీ, పోలీస్ లైన్, జేబీ టవర్స్, డి3 సెక్షన్ పరిధిలో నాందేవాడ, ప్రభాస్ టాకీస్ ఏరియా, మహా లక్ష్మీ నగర్, అంబేద్కర్ కాలనీ, హరిచరణ్ కాలేజ్, డి9 సెక్షన్ లో సుభాష్ నగర్, డి5 సెక్షన్ పరిధిలో ముబారక్ నగర్, పెద్దమ్మ టెంపుల్ ఏరియా, లక్ష్మీ ప్రియ నగర్ 1, ఆర్మూర్ రోడ్డు, భులక్ష్మి మతా, ఆర్టీసీ కాలని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-దోమకొండ



వాహనదారులు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని యస్ఐ సుధాకర్ అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని లింగుపల్లి రోడ్డు ప్రాంతం లో బుధవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా యస్ ఐ సుధాకర్ మాట్లాడుతు వాహనదారులు ప్రతి ఒక్కరు తమ వద్ద వాహనాల ధ్రువ పత్రాలు, కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాని పలు వాహనాలకు జరిమానా విధించామని తెలిపారు. ఈ కార్యక్రమం లో పోలీసులు. కిరణ్, లింగం, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వర్సెస్ ఎమ్మెల్సీ

- కవితకు మరోసారి ఈడీ నోటీసు
- నేడు విచారణకు పిలుపు
- తెలంగాణ తలవంచదు : ఎమ్మెల్సీ కవిత
- మీ వల్లే తలవంపులు : ఎంపీ అరవింద్
- ట్విట్టర్ వేదికగా మాటల యుద్ధం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



ఎమ్మెల్సీ కవిత..



ఎంపీ అరవింద్

ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారంలో ఎమ్మెల్సీ కవితకు మరోసారి ఈడీ నోటీసు జారీ చేయడంతో బీజేపీ ఎంపీకి, ఎమ్మెల్సీ కవితకు ట్విట్టర్ వేదికగా మాటలయుద్ధం సాగింది. ఢిల్లీలో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం 10వ తేదీన ధర్నా తలపెట్టిన నేపథ్యంలో... ఉద్దేశపూర్వకంగా 9వ తేదీన విచారణకు రావాలని ఈడీ ఆదేశించిందని కవిత ఆరోపించారు. బీజేపీ చేతలకు తెలంగాణ తలవంచబోదని ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ వ్యాఖ్యలను బీజేపీ నేత, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తిప్పికొట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏనాడూ తలవంచలేదని, కానీ ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత ప్రమేయం వల్ల దేశం ముందు తలవంచాల్సి వస్తోందని అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవితకు ఈడీ నోటీసులు జారీ చేసింది. మనీలాండరింగ్ అంశానికి సంబంధించి విచారణకు రావాల్సిందిగా పేర్కొంది. ఈ కేసులో కవితకు సన్నిహితంగా ఉన్న అరుణ్‌రామచంద్రన్ పిళ్లైను అరెస్టు చేసిన మరుసటి రోజే కవితకు నోటీసులు జారీ చేయడం గమనార్హం.

తెలంగాణ తల వంచదు : ఎమ్మెల్సీ కవిత

"రాజకీయ రంగంలో తగిన ప్రాతినిధ్యం కల్పించడానికి సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలన్నది మా డిమాండ్. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టి ఆమోదించాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు మహిళా సంఘాలతో కలిసి భారత్ జాగృతి ఈ నెల 10న జంతర్ మంతర్ వద్ద ఒకరోజు నిరాహార దీక్షను తలపెట్టింది. ఈ క్రమంలోనే మార్చి 9న ఢిల్లీలో విచారణకు రావాల్సిం దిగా ఈడి నాకు నోటీసులు జారీ చేసింది" అని కవిత ట్విట్టర్ వేదికగా స్పందించింది. ఇలాంటి చర్యలతో బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని లొంగ తీసుకో వడం కుదరదని బిజెపి తెలుసుకో వాలని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఉంటామని, దేశ అభ్యున్నతి కోసం గొంతెత్తుతామని అన్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి తెలంగాణ ఎప్పటికీ తలవంచబోదని తెలిపారు.

మీ వల్లే తలవంపులు : ఎంపీ ధర్మపురి అరవింద్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలపై బీజేపీ నేత, ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందించారు. తెలంగాణ ఉద్యమంలోనూ, ఇప్పుడు తెలంగాణ ఎన్నడూ ఎవరి ముందు తలవంచలేదని, కానీ ఢిల్లీ లిక్కర్ స్కాంలో మీ ప్రమేయం వల్ల తెలంగాణ తొలిసారి దేశం ముందు సిగ్గుతో తలవంచుతోందని అరవింద్ విమర్శలు గుప్పించారు. లిక్కర్ స్కాం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు ముందుకు తీసుకొచ్చారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం 2014-18 వరకు ఆయన కేబినెట్‌లో ఒక్క మహిళా కూడా లేరని అన్నారు. కవిత పార్టీలో ఆధిపత్యం వల్ల కేబినెట్‌లో మహిళలకు చోటు దక్కలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల్లో ఓడిపోయిందని, తదనంతరం నెపోటిజం కోటాలో ఎమ్మెల్సీ అయి ఇప్పుడు ఢిల్లీ లిక్కర్ స్కాంలో కీలక కుట్రదారుగా వ్యవహరించిందని విమర్శించారు.



బీజేపీ మోడీ ప్రభుత్వంపై మంత్రి వేముల ఫైర్..

'దేశంలో మోడీ అవినీతి పాలనను కేసిఆర్ ప్రశ్నిస్తున్నందునే ఆయన్ను ఢీకొనే సత్తాలేక వారి కుమార్తె ఎమ్మెల్సీ కవితను ఆడబిడ్డ అని కూడా చూడకుండా ఈడి నోటీసుల పేరిట వేధిస్తోందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. ఇది నీచాతినీచమైన రాజకీయ కుట్ర అని అన్నారు. కేంద్ర బీజేపీ, మోడీ రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమే ఈ నోటీసులని తెలిపారు. మోడీ సర్కార్ ఎన్ని కుట్రలు చేసినా కేసిఆర్ తలొగ్గబోరని అన్నారు. ఇట్లాంటి ఊకదంపుడు బెదిరింపులకు భయపడితే తెలంగాణ రాష్ట్రం సాధించేవాడే కాదని అన్నారు. మోడీ బినామీ అదానీ ఎల్ఐసి,ఎస్‌బీఐలలో ప్రజలు దాచుకున్న సొమ్మును దోచుకున్నాడని, ఇందులో వేల కోట్ల కుంభకోణం జరిగిందని పేర్కొన్నారు. దమ్ముంటే దానిపై ఈడి, సిబిఐ కేసులు పెట్టి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

మహిళా దినోత్సవ వేడుకలకు మంత్రి వేముల దూరం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దూరంగా ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం కామారెడ్డితో పాటు నిజామాబాద్ జిల్లాలోని తన నియోజకవర్గంలో పలు కార్యక్రమాలకు హాజరు కావాల్సి ఉంది. కానీ ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసుల నేపథ్యంలో ఆయన పర్యటనను హఠాత్తుగా రద్దు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 10:00 గంటలకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో రెఫరల్ సెంటర్, హెల్ప్ డెస్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. అలాగే జిల్లా కేంద్రంలోని కళాభారతిలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాల రాయితీ నిధుల చెక్‌లను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ మంత్రి పర్యటన చివరి నిమిషంలో రద్దు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా ఆరోగ్య హెల్ప్ డెస్క్‌ను జడ్పీ ఛైర్‌పర్సన్ శోభ ప్రారంభించారు. రిఫరల్ సెంటర్‌ను మున్సిపల్ ఛైర్‌పర్సన్ జాహ్నవి ప్రారంభించారు. ఇక అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో చెక్కులను విప్ గంపగోవర్ధన్ చెక్కులను పంపిణీ చేశారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం

- తోటి ఆటోడ్రైవర్‌ల ఉదారత

నవతెలంగాణ-రాజంపేట్



చెక్కు అందజేస్తున్న తోటి ఆటో డ్రైవర్‌లు

మండలంలోని తోటి ఆటో యూనియన్ సభ్యుడు ప్రమాదవశత్తు మృతి చెందడంతో కుటుంబం పడుతున్న బాధలను చూసి ఆటో యూనియన్ సభ్యులు స్పందించి వారి కుటుంబానికి తమ వంతు సహకారంగా మూడు లక్షల రూపాయలు బాధిత కుటుంబానికి అందజేశారు. కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆటో యూనియన్ సభ్యులు ముఖిరే ఆదిరెడ్డి (35) ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం పడుతున్న బాధలను చూసి అతని ముగ్గురు పిల్లలు ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆటో యూనియన్ నాయకులు తోటి యూనియన్ సభ్యులు తమ వంతు సహాయంగా మూడు లక్షల రూపాయలు స్థానిక ఎస్సై రాజు, గ్రామ సర్పంచ్ బీరయ్య సమక్షంలో అట్టి చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. తమ తోటి ఆటో యూనియన్ సభ్యుడు మృతి చెందితే తమవంతు సహకారంగా ఆర్థిక సహాయాన్ని అందించి వారి కుటుంబానికి అండగా నిలిచి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చిన ఆటో యూనియన్ సభ్యులను ఎస్సై అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నీరుడి శంకర్, మాజీ సర్పంచ్ యాదవ్ గౌడ్, శివరాజా గౌడ్, ఆటో యూనియన్ అధ్యక్షులు గంగాధర్ ,కార్యదర్శి నర్సగౌడ్ తదితరులు ఉన్నారు.

పేదల గుడిసెలకు నిప్పు

- దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి



దుండగులు నిప్పు పెట్టడంతో దహనమైన గుడిసె

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లిలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. దీంతో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి నర్సింలు బుధవారం సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత రాత్రి గ్రామానికి చెందిన కొందరు దుండగులు గుడిసెలను నిప్పు పెట్టారని, దుండగులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెల జోలికొస్తే పెద్దఎత్తున తిరగబడతామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రానికి చెందిన తాళ్ళ నాగరాజు (36) అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం ఆయన కుటుంబాన్ని జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మోహన్ పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాల్ రాజ్, సొసైటీ చెర్మెన్ మల్లికార్జున్, డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, కిషోర్ రెడ్డి, నజీర్, నల్ల హన్మంత్ రెడ్డి, పోత రాజు, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ప్రశంసనీయం

- అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో కొనియాడిన వక్తలు
- ప్రభుత్వ తోడ్పాటుతో మరింతగా రాణించాలని పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ



ఆకుల లలితను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సమాజ అభివృద్ధిలో మహిళలు పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమని వక్తలు కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ మరింత అభివృద్ధిని సాధించాలని వారు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని స్థానిక న్యూ అంబేద్కర్ భవన్ లో అట్టహాసంగా మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు మాట్లాడుతూ, నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుకుంటున్నారని అన్నారు. పోరాడి సాధించు కున్న తెలంగాణ రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్ అమలు చేస్తోందని, నామినేటెడ్ పదవుల్లోనూ పెద్దపీట వేస్తోందని గుర్తు చేశారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో ఎంతో చక్కగా రాణిస్తూ, సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. ఉద్యోగాల నిర్వహణ, క్రీడా రంగంలోనే కాకుండా రక్షణ రంగంలో సైతం సత్తా చాటుకుంటున్నారని కొనియాడారు. మహిళల పట్ల సమాజ దృక్పథంలో చాలా వరకు మార్పు వచ్చిందని, అయితే ఈ మార్పు గ్రామీణ ప్రాంతాల వరకు కూడా విస్తరించబడాలని, అప్పుడే అన్ని ప్రాంతాల్లోనూ మహిళలకు తగిన గౌరవం, సమానత్వం దక్కుతుందని అభిప్రాయ పడ్డారు.

మేయర్ నీతూకిరణ్ మాట్లాడుతూ, రాజకీయాల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మహిళలకు స్థానిక సంస్థల్లో శాసనం ద్వారా యాభై శాతం రిజర్వేషన్ అమలు చేస్తోందని, ఫలితంగా జిల్లాలోని నిజామాబాద్ నగరపాలక సంస్థ మేయర్‌తో పాటు, మిగతా మూడు మున్సిపాలిటీల్లోనూ అతివలు చైర్ పర్సన్లుగా చక్కగా రాణిస్తున్నారని అన్నారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ మహిళలు అందరూ తమ శక్తి సామర్థ్యాలు చాటాలని సూచించారు.

ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న మహిళలు, మహిళా ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా, మహిళా సహకార కార్పొరేషన్ చైర్పర్సన్ ఆకుల లలిత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు సూదం లక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధారాణి, నిజామాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, నీరజారెడ్డి, గుజ్జ రాజేశ్వరి , సీడీపీఓ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు



పాల్గొన్న యువత



వల విసురుతున్న వ్యక్తి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లా రెడ్డి మండలంలోని కల్యాణి గ్రామ చెరువులో బుధవారం మత్స్యకారులకు వృత్తి నైపుణ్యత పరీక్షలు జిల్లా మత్స్యశాఖ అధికారి వరదరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణి గ్రామానికి చెందిన 26 మంది , తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన ముగ్గురికి వృత్తి నైపుణ్యత పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ లు మత్స్యకారులకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, 18 సంవత్సరాలు నిండిన వారికి సభ్యత్వం కల్పించాలని ఆదేశించడంతో వారి ఆదేశానుసారం రాష్ట్ర మత్స్యశాఖ రెండో విడత మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. వృత్తి నైపుణ్య పరీక్షల్లో భాగంగా వల విసురుడు, ఈత కొట్టడం, పాండి గుంజుడు, తదితర పరీక్షలు నిర్వహించారు, ఈ నివేదికలను రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాస్ తెలంగాణ ముదిరాజ్, జిల్లా మత్స్యశాఖ సిబ్బంది శ్వేత సురేష్ రాజు రమేష్ సిద్దయ్య మత్స్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూ

నవతెలంగాణ-మద్నూర్



రుణాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఈడీ

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2020-21కి గాను అర్హులకు సబ్సిడీపై రుణాలు అందించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు మద్నూర్ ఎంపీడీవో రాశీశ్వర్ గౌడ్ తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ రుణ దరఖాస్తుదారులకు ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఈడి దయానంద్ ఆధ్వర్యంలో బుధవారం మద్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దాదాపు 102 మంది దరఖాస్తుదారులు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో దరఖాసుదారులకు అజయ్ సబ్సిడీ రుణాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ విజయ్ కుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎస్బిఐ శాఖ మేనేజర్ కెనరా బ్యాంక్ మేనేజర్ ఇతర శాఖల బ్యాంకు మేనేజర్లు సిబ్బంది పెద్ద మొత్తంలో దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-బిచ్కుంద



పనులు ప్రారంభిస్తున్న అశోక్ పటేల్

మండలంలోని మాన్యపూర్ గ్రామంలో నాలుగు లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ అశోక్ పటేల్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాలకు దీటుగా గ్రామాలను అభివృద్ధి చేయడానికి ప్రత్యేకమైన నిధులు కేటాయించి సిసి రోడ్లు, మురుగు కాలువలు, కమిటీ భవనాలు నిర్మాణం చేపట్టి గ్రామాలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, పుల్కల్ సొసైటీ అధ్యక్షులు రామిరెడ్డి, గ్రామ సర్పంచ్ దాసరి రాములు, ఎంపిటిసి కొట్టం సహదేవ్, సితరంపల్లి సర్పంచ్ ర్యాలగంగారెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేలానికి వేళాయే..

13న నవీపేట్ మేకల, వారంతపు సంతల వేలం

- ఈ ఏడాదైనా సిండికేటుగాళ్లకు కళ్లెంపడేనా..?
- పారదర్శకం అంటున్న పాలకవర్గం
- పేరుకే నిబంధనల నియమావళి..
- గత ఏడాది హై డ్రామా!

నవతెలంగాణ-నవీపేట్



మేకల, వారంతపు సంతలకు నవీపేట్ రాష్ట్రంలోనే పేరుగాంచింది. అంతటి ప్రతిష్టాత్మకమైన సంతల వేలానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 13న వేలం పాట నిర్వహించేందుకు తేదీ ఖరారు అయింది. ఈ మేరకు నవీపేట్ సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్, కార్యదర్శి గంగాధర్ బుధవారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ క్రమంలో సంతలను దక్కించుకునేందుకు ఔత్సాహికులు సిద్ధమవుతుండగా.. సిండికేటు గాళ్లు సైతం సంతలను దక్కించుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు స్థానికంగా చర్చలు వ్యక్తమవుతున్నాయి.

సిండికేటుగాళ్లకు కళ్లెంపడేనా?

రెంజల్ మండలం సాటాపూర్‌లో జరిగే మేకల సంత క్రయ విక్రయదారుల అభ్యర్థన మేరకు 1994-95వ సంవత్సరంలో నవీపేట్‌కు మేకల సంతను మార్చారు. అప్పటి నుండి ఓకే గుత్తేదారు పాలకవర్గాన్ని మచ్చిక చేసుకోవడమే కాక పాటాదారులకు గుడ్ విల్ అందించి దక్కించుకోవడం గమనార్హం. మేకల సంతకు ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, జహీరాబాద్, మెదక్ మరియు మహారాష్ట్ర ప్రాంతంలోని నాందేడ్, పర్భని జిల్లాల నుండిక్రయవిక్రయదారరులు వేల సంఖ్యలో వస్తుండడంతో ఏడాదికి గుత్తేదారుకు కోటికి పైగా ఆదాయం వస్తుంది. దీంతో గుత్తేదారు ఎటువంటి పరిస్థితుల్లోనైనా వేలంను నయానో భయానో దక్కించుకుంటున్నారు. కాబట్టి ఈసారైనా పాలకవర్గం ప్రజల సంక్షేమం కోసం వేలంపాటను పారదర్శకంగా నిర్వహించి సిండికేట్ గాళ్ళకు కళ్లెం వేయాలని స్థానికులు భావిస్తున్నారు.

పేరుకే నిబంధనావలి..

ప్రతి సంవత్సరం వేలం నిబంధనలను ప్రకటిస్తున్న పంచాయతీ పాలకవర్గం కచ్చితంగా అమలు చేయకపోవడంతో పేరుకే నిబంధనావలి అన్న చందంగా మారింది. 15 నిబంధనలతో వేలం నిబంధనావలి మీడియాకు ప్రవేశపెట్టినప్పటికీ గుత్తేదారు నిబంధనలకు విరుద్ధంగా మేకలు, వాహనాలకు అధిక డబ్బులు వసూలు చేసిన పంచాయతీ పాలకవర్గం పట్టించుకోకపోవడంతో క్రయ విక్రయ దారు లు గుత్తే దారుతో ఘర్షణలకు దిగిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. అయినప్పటికీ పంచాయతీ పాలకవర్గం పట్టించుకోకపోవడంతో గుత్తే దారుడి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుండగా.. పంచాయతీ ఆదాయం నష్టపోతోంది. ప్రతి వేలంపాట సమయంలో కార్యదర్శులు గుత్తేదారుడు వసూలు చేయాల్సిన రేట్లు సూచిక బోర్డులు సంతలో అమరు స్తామని చెబుతున్నా మాటలకే పరిమితమవుతున్నాయి.

గత ఏడాది హైడ్రామా..

గత ఏడాది మేకల, వారంతపు సంతల వేలం ముచ్చటగా మూడుసార్లు నిర్వహించినా అప్ సెట్ ధర రాకపోవడంతో పంచాయతీ పాలకవర్గ తీర్మానంతో హై డ్రామా మధ్య పాత గుత్తేదారు తిరిగి దక్కించుకున్నారు. మూడోసారి వేలం పాటలో డీఎల్పిఓ నాగరాజు రాగా 72 మంది వేలంపాట దారులు పాల్గొనగా కేవలం ముగ్గురు మాత్రమే వేలంపాటలో పాల్గొనడం విశేషం. డిఎల్‌పిఓ సాక్షిగానే వేలం పాటకు గంట ఆలస్యంగా వచ్చి గుత్తేదారులు బహిరంగంగానే బుజ్జగింపులు కొనసాగించి అదే రోజు సంతల వేలం ముగించాలని పాలకవర్గం, అధికారులపై పట్టుబట్టడం మాఫియాను తలపించింది. ఇంత జరుగుతున్నా అధికారులు, పాలకవర్గం చోద్యం చూస్తూ ఉండిపోయారు. దీంతో అంతకుముందు ఏడాది కంటే మేకల సంతకు 10 లక్షల రూపాయలు, రోజు వారంతపు సంతలకు 6 లక్షల ఆదాయం గ్రామ పంచాయతీ కోల్పోయింది. ఒకవేళ పారదర్శకంగా నిర్వహిస్తే మేకల సంతకే 50 లక్షలకు పైగా వేలం పాట రావచ్చన్నది బహిరంగ రహస్యం. కాబట్టి ఈసారి పాలకవర్గానికి చివరి ఏడాది కావడంతో ఇటువంటి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు మద్దతు ఇవ్వకుండా సిండికేటుగాళ్లకు కళ్లెం వేసి ప్రజల మన్ననలు పొందాలని పలువురు చర్చించుకుంటున్నారు.

ఎమ్మెల్యే బిగాలను కలిసిన రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



నూతన తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ బుధవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఎంతో నమ్మకంతో రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా నియమించినందుకు అన్సారిపై ఉఎంతో బాధ్యత ఉందని అన్నారు. ఈసందర్భంగా తారిక్ అన్సారి సీఎంకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపారు.

మహిళా సాధికారతపై అవగాహన

నవతెలంగాణ-బోధన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సాలూర మండలంలోని సాలూర క్యాంప్ గ్రామంలో సిరిసిల్ల ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శిక్షణ విద్యార్థులు బుధవారం గ్రామ పంచాయతీ వద్ద మహిళలకు మహిళా సాధికారతపై అవగాహన నిర్వహించారు. మహిళలకు రాజ్యాంగంపై, వారి హక్కులపై, చట్టసభలో ప్రాధాన్యతపై వివరించారు. మహిళలు పురుషులకు సమానంగా రాణిస్తున్నారని, కావున మహిళలు వారి అభిరుచుల మేరకు ఇష్టమున్న రంగాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అపర్ణ, అంగన్వాడీ కార్యకర్త ఆదిలక్ష్మి, వ్యవసాయ శిక్షణ విద్యార్థులు ప్రశాంత్, శివమణివాస్, శ్రీవాత్సవ్, ప్రదీప్, మహిళలు పాల్గొన్నారు .

సంతల వేలం పారదర్శకంగా నిర్వహిస్తాం

- సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్

నవతెలంగాణ-నవీపేట్

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద సంతలైన నవీపేట్ మేకల, వారాంతపు సంతలను ఈ ఏడాది పారదర్శకంగా నిర్వహిస్తామని జిల్లా నుండి ఆసక్తిగల గుత్తేదారులు హాజరై వేలంపాటలో పాల్గొనాలని నవీపేట్ సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13నుండి గ్రామపంచాయతీలో మేకల, రోజు వారి వారాంతపు సంతలను కలిపి డాక్టర్ వాటర్, మరుగుదొడ్ల వేలం పాటలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేలంపాటలకు జిల్లాతో పాటు ఇతర జిల్లాల కాంట్రాక్టర్లు సైతం హాజరుకావాలని కోరారు. మేకల, వారంతపు సంతలకు లక్ష రూపాయల డిపాజిట్, డాక్టర్ వాటర్ మరియు మరుగుదొడ్ల(సులబ్ కాంప్లెక్స్)కు 50వేల డిపాజిట్ సోమవారం ఉదయం 11 గంటలలోపు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు. వేలంపాట దారుల మొబైల్ ఫోన్లు అనుమతించబడవని తెలిపారు. వేలంపాట దక్కించుకున్న గుత్తేదారులు పాడిన వేలంలో 1/4 వంతు వెంటనే చెల్లించాలని వేలం నిబంధనావళి ప్రకారం అగ్రిమెంట్ చేసుకోవాల్సివస్తుందని తెలిపారు.

ప్రారంభోత్సవాలకు సర్వం సిద్ధం

- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు
- నేడు ప్రారంభించనున్న ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని లోలం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలను ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నిర్వహించ నున్నట్లు సర్పంచ్ మమత శేఖర్, ఎంపిటిసి డీకోండ సరిత సుధీర్ తెలిపారు. గ్రామపంచాయతీ నూతన భవనాన్ని, కమ్యూనిటీ హాళ్ళు, సీసీ రహదారులు, డ్రైనేజ్, రైతు వేదిక, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, మహిళ భవనం, వైకుంఠధామంతో పాటు పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. గ్రామంలో మిగిలిపోయిన పనులకు ఎమ్మెల్యే నిధులు కేటాయిస్తారని గ్రామస్తులు ఎన్నో ఆశలతో ఉన్నారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అడిగిన వెంటనే నిధులను కేటాయిస్తున్నారని గ్రామానికి వరాల జల్లు కురిపిస్తారని నాయకులు పేర్కొన్నారు. లోలం గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం చేపట్టి ఏళు గడుస్తున్న ప్రారంభానికి నోచుకకపోవడంతో పురాతనమైన భవనంలోనే పాలన కొనసాగించారు. ఈ విషయమై నవ తెలంగాణలో కథనం వచ్చిన నాటి నుండి నాయకులు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. గ్రామంలో మిగిలి ఉన్న సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలు, కుల సంఘాల భావన నిర్మాణలకు నిధులు కేటాయిస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు. జనవరి 30న వీటన్నింటిని ప్రారంభించాల్సి ఉండగా రెండు గ్రామాల



మధ్య బ్రిడ్జి నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం కావల్సిన సమయంలో వివాదం ఏర్పడటంతో వాయిదా పడ్డాయి. ఎట్టకేలకు ప్రారంభోత్సవం కానుండడంతో నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

10న ఉద్యోగ మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల10న ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు అపోలో ఫార్మసీ, రిటైల్ ట్రైనీ అసోసియేట్, ఫార్మసీ అసిస్టెంట్, ట్రైనీ ఫార్మసిస్ట్, ఫార్మసిస్ట్ ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్హత ఇంటర్/డిగ్రీ/డిఫార్మసీ/బీఫార్మసీ/ ఎంఫార్మసీ(విత్ పీసీఐ)ఆపైన వయోపరిమితి 18 నుండి 30 ఏండ్లవరకు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులకు ఉద్యోగమేళాలో జిల్లా ఉపాధి కార్యాలయం నిజామాబాద్ జిల్లాలో పాల్గొనాలని తెలిపారు. ఇతర వివరాలకు 9581768413, 9959456793 ఫోన్ ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10-00 నుండి మధ్యాహ్నం 2-00 గంటల లోపు జిల్లా ఉపాధి కార్యాలయం శివాజీ నగర్‌కు రావాలని తెలిపారు. బయో డేటా, ఆధార్ కార్డు, పాసుపోర్టు సైజు ఫోటో అభ్యర్థుల సర్టిఫికెట్స్ తీసుకొని రావాలని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు జెడ్పీటీసీ చౌటపల్లి రవి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, సర్పంచ్‌లు శంకుస్థాపనలు చేశారు. మెండోరాలో 15 లక్షలు, పల్లికొండలో 20 లక్షలు, పిప్రిలో 25 లక్షలు, పురాణిపేట్‌లో 15 లక్షలు, బాబానగర్‌లో 5 లక్షలు, బాబాపూర్‌లో 20 లక్షలు, బాచన్‌పల్లిలో 5 లక్షలు, దేవక్కపేట్‌లో 10 లక్షలు, దేవన్‌పల్లిలో 5 లక్షలు, కారేపల్లిలో 5 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు జెడ్పీటీసీ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోయిజ్, శర్మనాయక్, గుణవీర్‌రెడ్డి, సర్పంచ్‌లు రాజేందర్, యమున గంగారాం, ప్రవీన్‌కుమార్, శంకర్, రాములు, కవితగంగాధర్, అనిల్, దేవాయిగంగారాం, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

10న చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ అధికారుల సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇంటర్మీడియట్ 2022-23 విద్యా సంవత్సర వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ అధికారుల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిజామాబాద్ బాలుర (ఖిల్లా) జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. మార్చి 15 నుండి ఏప్రిల్ 4 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు 54 పరీక్ష కేంద్రాలకు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులను నియమిస్తున్నామని తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు శుక్రవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు సమావేశానికి సమయానికి హాజరుకావాలని అన్నారు.

10న పెన్షనర్ల కుటుంబ సభ్యుల సమ్మేళనం

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న పెన్షనర్స్ సంఘం నాయకులు

తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పెన్షనర్ల కుటుంబ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా గౌరవాధ్యక్షులు శాస్త్రుల దత్తాత్రేయరావు, అధ్యక్షుడు కే.రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి యస్. మదన్మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్ రావు తెలిపారు. బుధవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. లింగ సమానత్వం కోసం పాటుపడాలని, సమాన పనికి సమాన వేతనం, మహిళల పట్ల వివక్షతను విడనాడాలని ప్రధాన లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా నగర మున్సిపల్ మేయర్ నీతూ కిరణ్, ఆత్మీయ అతిథులుగా విద్యావేత్త డాక్టర్ అమృతలత, ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ కవితా రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ లింగా అరుణ, మహిళా ఉద్యమ నాయకురాలు సబ్బని లత, శ్రామిక మహిళా కన్వీనర్ నూర్జహాన్ తదితరులు హాజరవుతున్నట్టు తెలిపారు.

జానకంపేట్‌లో సీపీఐ(ఎం) కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట గ్రామంలో సావిత్రిబాయి పూలే నగర్‌లో సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయాన్ని జిల్లా సీనియర్ నాయకులు కె.రామ్మోహన్‌రావు ప్రారంభించారు. అనంతరం మండల అధ్యక్షులు జంగం గంగాధర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రాథమికంగా ఉన్న హక్కులను ఉపయోగించుకోవాలని అన్నారు. విద్యా వైద్యం. ప్రభుత్వ రంగంలోనే ఉపయోగించుకోవాలని తెలిపారు. గూడు లేక ఉపాధి సక్రమంగా దొరకక ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో తొమ్మిది సంవత్సరాల క్రితం వేసుకున్న గుడిసెల స్థానంలో పక్కా నిర్మాణంకోసం రుణాలు 5లక్షల30వేలు ప్రభుత్వం చెల్లించాలని అన్నారు. జీవో 51 ప్రకారం గుడిసె వాసులకు రెగ్యులర్ చేస్తూ పట్టా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ఆఫీసును ఉపయోగించుకుంటూ చదువు రాని వారికి రాత్రి బడులు నడుపుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు సబ్బని లత, ఏరియా కార్యదర్శి వర్గ



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

సభ్యులు నాయక్ వాడి శ్రీనివాస్, సావిత్రిబాయి పూలే నగర్ నాయకులు బాలు, ఫర్జానా బేగం, లక్ష్మి, మనమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

గుడిసెలవాసులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి

- సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-ఎడపల్లి

గుడిసెలవాసులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో సుమారు 300 మంది నిరుపేదలు అద్దె ఇంట్లో ఉంటున్నారని, వారు సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జంగం గంగాధర్ , నెహ్రు నగర్ గ్రామ పేదలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్‌బాబు

భూమి విషయంలో కొట్లాట

ఇరువురికి గాయాలు

నవతెలంగాణ-సిరికొండ



మండలంలోని దుప్య తాండ గ్రామపంచాయతీ పరిధిలో భూమి విషయంలో ఇద్దరు యువకుల మధ్య కొట్లాట జరగడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైనట్టు ఎస్సై నర్సింలు తెలిపారు. దుప్యతాండకు చెందిన గోవింద్, మురహరి బావ బావమరుదులని అన్నారు. భూమి విషయంలో ఇరువురి మధ్య గొడవ జరగడంతో ఇద్దరు కర్రలతో కొట్టుకోవడం జరిగిందన్నారు. దీంతో గోవిందు తలకు తీవ్ర గాయం కాగా మురహరికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. గోవిందు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో ఉన్నారని, మురహరి ఆర్మూర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మురహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ హెల్ప్ డెస్క్ ప్రారంభం

నవతెలంగాణ-మెండోర

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని డిసిసిబి డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ రెడ్డి, ప్రజాప్రతినిధుల సమక్షంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపిపి బురుకల. సుకన్య కమలాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆరోగ్య మహిళ హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా స్త్రీలకు సంబంధించిన ప్రత్యేక వైద్యాన్ని అందిస్తారని అన్నారు. అనంతరం మహిళలకు మహిళ ఆరోగ్య బుక్కులను అందించారు. కార్యక్రమంలో ఎంపిపి బురుకల.సుకన్య కమలాకర్ , మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు డిసిసిబి డైరెక్టర్ నాగంపేట్.శేఖర్ రెడ్డి , జడ్పీటీసీ తలారి గంగాధర్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ నవీన్ గౌడ్, సర్పంచ్ ఫోరమ్ మండల అధ్యక్షులు సామ గంగారెడ్డి, వైస్ ఎంపీపీ సరస్వస్వతి రవి గౌడ్ , సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్ మచ్చర్ల రాజరెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షులు సాయిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభింస్తున్న ప్రజాప్రతినిధులు

10న రెండో విడత ప్లాట్ల విక్రయం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ నగర పరిధిలోని మల్లారం గ్రామ శివారులోగల ధాత్రి టౌన్ షిప్‌లో రెండవ విడత (150) ప్లాట్ల విక్రయానికి సంబంధించిన అవగాహన సదస్సు ఈనెల 10న నిర్వహించనున్నట్టు కలెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.00 గంటలకు సమీకృత కార్యాలయాల సముదాయంలో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

సీసీ రోడ్లకు భూమిపూజలు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం ఎన్ఆర్ ఈజీఎస్ ద్వారా రూ.40 లక్షల రూపాయలు మంజూరైనట్లు ఎంపీపీ సామ పద్మ వెంకట్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మార్కెట్ యార్డు నుంచి సుభాష్ కాలనీ వరకు సీసీ రోడ్ల నిర్మాణం కోరకు భూమిపూజ చేసి పనులను మండల ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఎంపిక చేసిన కాలనీలలో సీసీ రోడ్లు వేయనున్నట్టు తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ నర్సారెడ్డి, సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ కిషన్, ఉప సర్పంచ్ బ్రమ్మదండి సువర్ణ లింగం, పంచాయతీ సెక్రటరీ, వార్డ్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..

సాలంపాడ్‌లో ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



తలపడుతున్న మల్లయోధులు

నవతెలంగాణ - బోధన్

హెూలీ పండుగను పురస్కరించుకొని బుధవారం సాలూర మండలం సాలంపాడ్ గ్రామంలో గ్రామస్తులు కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ కుస్తీ పోటీలలో పలు గ్రామాల నుంచి తరలివచ్చిన మల్లయోధులు పాల్గొన్నారు. విజేతకు గ్రామ పెద్దలు నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నర్సారెడ్డి, బసవంతరావు పటేల్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు ఆర్థిక సహాయం అందజేత

- చికిత్స పొందుతున్న బాలికకు ఖర్చులు భరిస్తానిని ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ భరోసా

నవతెలంగాణ-ధర్పల్లి

నెలరోజులక్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో తల్లిదండ్రులు మృతిచెందగా అనాథలైన పిల్లలకు ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన పానేటి రాములు, భార్య సత్తెవ్వ రోడ్డుప్రమాదంలో మృతిచెందగా వారి ముగ్గురు ఆడపిల్లలు అనాథలయ్యారు. ఈప్రమాదంలో ఒక కూతురుకి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతుందుతోంది. ఈ విషయాన్నీ తెలుసుకున్న బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం వారికి అత్యవసర సహాయం కింద 30 వేలు అందజేశారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అన్నపూర్ణ అనే బాలికకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రి ఖర్చు ఎంతైనా తానే భరిస్తానని తెలిపారు. చిన్నారులను అక్కున చేర్చుకొని అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ముగ్గురు పిల్లల పోషణ, చదువు, తదితర విషయాలను వారి దగ్గరి బంధువులకు అడిగి తెలుసుకున్నారు. వారి చదువుకు అయ్యే ఖర్చును భరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు, ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్,ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి,మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, కిషోర్ రెడ్డి, బాజా సత్యరాజ్, కడమంచి సాయిలు, శ్రీకాంత్, రాములు, దాసు, పనేటి శ్రీను, సంకు సాయిలు, టెకీ నిర్మల, అల్లం దుర్గయ్య, అల్లం కాశీరాం, కళ్లెం రాజు ఉన్నారు.



చిన్నారులకు ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే బాజిరెడ్డి

ప్రశాంతంగా పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల్లో బుధవారం ఉదయం జరిగిన ఎంబిఎ, ఎంసిఎ 3వ సెమిస్టర్, రెగ్యులర్ పరీక్షలో 462మంది విద్యార్థులకు గాను 438మంది హాజరయ్యారని, 24 మంది గైర్హాజరయ్యారని తెలంగాణ యూనివర్సిటీ పరిక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఎంబిఎ, ఎంసిఎ 1వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష లో 562 మంది నమోదు చేసుకోగా 524మంది హాజరయ్యారని, 38మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న మహిళ చిత్రం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థులు గీసిన చిత్రం అందరినీ ఆకట్టుకునే విధంగా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. నగరంలోని ఓయాసిస్ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవ సందర్భంగా విద్యార్థుల తల్లులను పిలిచి మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగానే సాంస్కృతి కార్యక్రమాలు, ఆటలు, పాటలు నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ శారద తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు గీసిన చిత్రం విద్యార్థుల తల్లులు, టీచర్లను ఆకట్టుకునే విధంగా ఉందన్నారు. ఈ చిత్రానికి మొదటి బహుమతిగా ప్రకటించడం జరిగిందని అన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి రెండు లక్షల విరాళం



దాతలను సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పండ్ల కేంద్రంలో నూతనంగా జీవిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఇద్దరు దాతలు రూ. లక్ష చొప్పున విరాళం అందజేశారు. బుధవారం అయ్యప్ప స్వామి జన్మ దినోత్సవం పురస్కరించుకుని గ్రామానికి చెందిన జడల కిషన్, బద్దం రాజశేఖర్(బద్రి), జడల మణికంఠ విరాళాలు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మల్యాల సుభాష్ గౌడ్, నరేందర్, శేఖర్, చింత గణేష్, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ , పురుష సమానత్వంకోసం పోరాడుదాం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్త్రీ పురుష సమానత్వని కై పోరాడుదాం అని డాక్టర్లు అన్నారు. ప్రగతి శీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్ కోటగల్లి లో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో సిపిఐ(ఎం ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ దేశంలో మహిళల శ్రమ ఉత్పత్తి రంగాల్లో పురుషుల కన్నా అధికంగా వినియోగించుకుంటున్నా హక్కులు మాత్రం లేవని అన్నారు. ఇంటి నుండి ప్రతి చోట మహిళలపై ఇంకా వివక్షత, అణిచివేత కొనసాగుతున్నాయని తెలిపారు. ఇంటి నుంచి మార్పు వచ్చినప్పుడే ఇది మారుతుందని అన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా వచ్చినటువంటి పిఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ పిట్ల సరిత, గడ్డం మేధ ఎంబీబీఎస్ డాక్టర్ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివినా ప్రతిచోట మహిళలపై వివక్షత ఇంకా కొనసాగుతూనే ఉందని అన్నారు.. స్త్రీ చాలా శక్తివంతమైనదని సహనంతో కుటుంబాలని నడిపేదే స్త్రీ అని పాలకులు చెబుతున్నా ఆచరణలో చట్టసభల నుంచి ఇంటి వరకు వివక్షత, వారి పెత్తనమే ఉంటుందని అన్నారు. యువత మత్తుకు, మత్తు పదార్థాలకు బానిసలై హత్యలు, అత్యాచారాలు చేయడం వల్ల ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమైపోయి రోడ్డులో పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆకుల అరుణ, జిల్లా ఉపాధ్యక్షులు వేల్పూరు లక్ష్మి జిల్లా నాయకులు నీలం లక్ష్మి, రజిత, రాధ, ఆకుల స్వప్న, ప్రమీల, నగర నాయకులు మానస, రాజ్యలక్ష్మి, సురేఖ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మేధ

నేడు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

తహశీల్దార్ కార్యాలయంలో గురువారం లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దార్ విక్రమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్దిదారులకు ముందస్తుగా సమాచారం అందించడం జరిగిందన్నారు. గురువారం ఉదయం 10:30 గంటలకు లబ్దిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. లబ్దిదారులు రాకుంటే ఆ చెక్కులను ఉన్నతాధికారులకు వెనక్కి పంపడం జరుగుతుందని అన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికార పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొనాలని పేర్కొన్నారు..

విఠలేశ్వరాలయంలో పూజలు


బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామంలో బుధవారం విఠలేశ్వర ఆయలంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో విఠలేశ్వర మందిరం వద్ద 7 రోజులు సప్త చేసి భజనలు చేశారు. బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో లక్ష్మన్, మహారాజు, అంజయ్య మహారాజు, గ్రామ సర్పంచ్ గంట రాజేశ్వరి-సాయిలు, ప్రజాప్రతినిధులు వెల్లుట్ల భజన మండలి గ్రామ పెద్దలు మహిళలు యువకులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



నవతెలంగాణ -నవీపేట్

మహిళా దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మోడల్ పాఠశాలలో విద్యార్థినులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన కీర్తన, భాను శ్రీ, మానసలకు సర్పంచ్ ఏ టి ఎస్ శ్రీనివాస్ బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏటీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థినిలకు చదువుతోపాటు ఆరోగ్యం, ఆటలు ఉన్నత స్థానానికి చేరుస్తాయని అన్నారు. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుంటే ఉత్తమ పౌర సమాజాన్ని నిర్మించవచ్చని జెవివి జిల్లా హెల్త్ కన్వీనర్ రాజశేఖర్ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నవీన్ కుమార్, కిషన్, దగడ్ సాయి, గంగాధర్, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- సీఐటీయూ జిల్లా నాయకుడు సురేష్ గొండ


కేజీబీవీలో ఉపాధ్యాయులకు, సిబ్బందికి సన్మానం

నవతెలంగాణ-జుక్కల్

మహిళలకు చట్టసభలో 35 శాతం రిజర్వేషన్ కల్పించాలని సిఐటీయూ జిల్లా నాయకులు సురేష్ గొండ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కేజీబీవిలో అంర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు తేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేజీబీవీలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు, ఆయాలకు, సిబ్బందికి శాలువతో సన్మానించారు. మహిళలు గొప్ప శక్తిమంతులని, సృష్టికి మూలం అమ్మే అని, స్త్రీ లేక పోతే సృష్టే లేదని అన్నారు. కార్యక్రమంలో కేజీబీవి అధికారిని అశ్విని, సిఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కవిత రాజీనామా చేసి చిత్త శుద్ధి నిరూపించుకోవాలి

నవతెలంగాణ-రామారెడ్డి

ఎమ్మెల్సీ పదవికి కవిత వెంటనే రాజీనామా చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పోసానిపేట్ సర్పంచ్ గీ రెడ్డి మహేందర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు నా రెడ్డి రాజు రెడ్డి బుధవారం వేర్వేరు ప్రకటనలో డిమాండ్ చేశారు. లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవిత తెలంగాణ పరువును ఢిల్లీలో తాకట్టు పెట్టిందని, కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపణలు వస్తున్నా, నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరైనది కాదని, వెంటనే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి, చిత్తశుద్ధి నిరూపించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సమానత్వం కోసం పోరాడుదాం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

స్త్రీపురుష సమానత్వంపై పోరాడుదామని పిఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరిత పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చి ప్రధాని బాధ్యతలు చేపట్టిన నాటి నుండి మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మహిళలపై మన ధర్మం పేరుతో హిందుత్వ ఫాసిస్టు దాడులు తీవ్రమయ్యాయని ఆమె అన్నారు. మండల కేంద్రంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి చిట్టక్క అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సభ నిర్వహించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.సూర్య శివాజీ మాట్లాడారు. సభలో మహిళా సంఘం నాయకులు వేంపల్లి ధనలక్ష్మి, ఎస్ నీలా, దేవకళ, జమున, లక్ష్మి.. ఐఎఫ్టియు నాయకులుఎల్.బి.రవి, డి పోశెట్టి, జిల్లా గ్రామపంచాయతీ కార్మికుల అధ్యక్షులు సుంకరి శ్రీనివాస్, సొప్పరి గంగాధర్ పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- ఆర్థికంగా బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి
- వడ్డీ రాయితీ రుణాల చెక్కులు అందజేసిన విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి


మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ రుణాల చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


మహిళా ఆరోగ్య హెల్ప్ డెస్కను ప్రారంభిస్తున్న నిట్టు జాహ్నవి

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ రాయితీ రుణాలు చెక్కులను అందజేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. గర్భిణీల కోసం కెసిఆర్ న్యూట్రిషన్ కిట్, బాలింతల కోసం కెసిఆర్ కిట్, ఆడబిడ్డల కోసం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఒంటరి మహిళల కోసం ఆసరా పింఛన్లు వంటి సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో మహిళల కోసం అధిక సంక్షేమ పథకాలు ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టలేదని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువులు ఇతర దేశాలకు తీసుకెళ్లి విక్రయించడం ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతమవుతున్నారని తెలిపారు. మహిళలు వేధింపులకు గురి కాకుండా ప్రభుత్వం షీ టీం లను ఏర్పాటు చేసిందని చెప్పారు. జిల్లా కేంద్రంలో క్యాన్సర్ పరీక్షలు చేసే యంత్రం వచ్చిందని పేర్కొన్నారు.

సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని పేర్కొన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ శోభ మాట్లాడారు. గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారని కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు.2019 జనవరి నుంచి2020 మార్చి వరకు 14,776 మహిళా సంఘాలకు రూ.44.35 కోట్ల వడ్డీ రాయితీ రుణాల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి, జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ఇందూ ప్రియ, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎంపీపీలు, జడ్పిటిసి సభ్యులు, డి ఆర్ డి ఓ సాయ న్న, అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో మహిళా ఆరోగ్య హెల్త్ డెస్క్ ప్రారంభం

కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా ఆరోగ్య హెల్ప్ డెస్క్ ను జడ్పీ చైర్పర్సన్ శోభ ప్రారంభించారు. రిఫరల్ సెంటర్ ను మున్సిపల్ చైర్పర్సన్ జాహ్నవి ప్రారంభిం చారు.

ప్రభుత్వం ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా 8 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తుందని తెలిపారు. ప్రతి మంగళవారం పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీ బీబీ పాటిల్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ఇందూ ప్రియ, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో పల్లెరోడ్లకు మహర్దశ

- సీసీ రోడ్డు పనులు ప్రారంభోత్సవంలో సర్పంచ్

నవతెలంగాణ-మద్నూర్/సదాశివనగర్


మదన్‌హిప్పర్గలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

సీఎం కేసీఆర్ హయాంలో పల్లెల్లోని రోడ్లకు మహర్దశ అని డోంగ్లి మండలం మదన్‌హిప్పర్గ సర్పంచ్ రాజ్‌కుమార్ అన్నారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయంలోనే పల్లె ప్రగతి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని గ్రామంలో ప్రజా అవసరాల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి వాడవాడలో సిసి రోడ్ల నిర్మాణం వాడవాడలో మురికి కాల్వల నిర్మాణం పనులు భారీ ఎత్తున చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామ ప్రజల అవసరాల కోసం పల్లె ప్రకృతి వన కేంద్రాలు వైకుంఠ దామం నిర్మాణం తాగునీటి సమస్య తీర్చినట్టు తెలిపారు. ప్రస్తుతం ఈజీఎస్ నిధుల ద్వారా నాలుగు లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామస్తులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని యాచారం గ్రామంలో బుధవారం సిసి రోడ్డు పనులను సర్పంచ్ లతా ప్రారంభించారు. గుడి తండా 4వ వార్డులో 5 లక్షల ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో పనులు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపిచంద్ నాయక్, వార్డు మెంబర్ రాజు నాయక్, రమేష్ నాయకులు పీర్ సింగ్, క్రాంతి గుప్తా, దశరథ్, కిషన్, రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.

కట్టెలపొయ్యిపై వంట

- గ్యాస్ సిలిండర్ ధరపై భగ్గుమన్న హమాల్‌వాడీ వాసులు


కట్టెలపొయ్యిపై వంట చేస్తూ నినాదాలు చేస్తున్న కాలనీవాసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గ్యాస్ సిలిండర్ ధరపై పెరుగుదలపై హమాల్‌వాడీ మహిళలు కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం హమాల్వాడి చౌరస్తా కట్టెలపొయ్యిపై వంట చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. మోడీ ఈ విధంగా గ్యాస్ ధరలు రోజురోజుకు పెంచుతా ఉంటే ప్రజలపై భారాలు మోపుతూ పెద్దలకేమో రాయితీలు కల్పిస్తుందని గ్యాస్, అధిక ధరలో బియ్యం ఉచితంగా అని చెప్పి గ్యాస్ ధరనేమో 1300 పెంచడం పొయ్యి మీదనే ఉడికే బియ్యాన్ని ఫ్రీగా అని చెప్పుకుంటూ దాని కింద అంటించే గ్యాస్ రేటు పెంచడం న్యాయమేనా..? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక మార్లు గ్యాస్ సిలిండర్ ధరలు పెంచి పెద, మధ్యతరగతి కుటుంబం లకు నడ్డి విడిచిందనీ దుయ్యబట్టారు. ఎన్నికల ముందు మోడీ నల్ల ధనాన్ని తెచ్చి ప్రతీ ఒక్కరి ఖాతాలో డబ్బులు వేస్తానని మోసం చేశారని మండిపడ్డారు. ఇప్పటికీ నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానంటేయని పెట్రోలు డీజిల్ లకు అంతే లేదని, మళ్లీ గ్యాస్ సిలిండర్ ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపరని అన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గంగమ్మ, సరూప, రాజేశ్వరి, ఆశ, కల్పన, బిబి శకుంతల, సరస్వతి, అంజమ్మ కవిత, సరూప, సవిత, సుజాత, రాజక్క తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని క్రేమాజ్‌కల్లాలీ 33కేవి సబ్ స్టేషన్ పరిదిలోని విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డుగా వస్తున్నందున తొలగించే పనులు చేపడుతున్నట్టు నేడు(గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొననున్నట్టు ట్రాన్స్ కో ఏఈ నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళలపై ఫాసిస్టు, మనువాద దాడికి వ్యతిరేకంగా పోరాడుదాం

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మహిళ లపై కెంద్ర ప్రభుత్వ ఫాసిస్టు, మనువాద దాడికి వ్యతిరేకంగా పోరాడుదాం అని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి (ఇన్చార్జి) వనమాల కృష్ణ అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం మార్చి 8 సందర్భంగా శ్రామిక భవన్ నుండి ఎన్.ఆర్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించి కోటగల్లీలో సదస్సు నిర్వహించారు. పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ముఖ్య వక్తలుగా విచ్చేసిన సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి (ఇన్చార్జి) వనమాల కృష్ణ మాట్లాడుతూ... పోరాటాలతో సాధించుకున్న హక్కులను సైతం నేటి పాలకులు కాలరాస్తూన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ, వడ్డీ లేని రుణాలు ఇవ్వకుండా మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పి.ఓ.డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నాటి సంధ్యారాణి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యక్క, నాగమణి, శకుంతల, సహాయ కార్యదర్శిలు గౌర, జిల్లా నాయకులు జమున, పావని, అంబిక, నర్సక్క, గంగామణి, లక్ష్మి, చంద్ర, ఆశలత, రజిని, పుష్ప, మమత పాల్గొన్నారు.

మహిళకు వందనం

- వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్న మహిళల ప్రగతిని కొనియాడిన పలువురు
- ఘనంగా మహిళా దినోత్సవం

నవతెలంగాణ-విలేకరులబృందం


వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే


జుక్కల్ మండలం క్రేమాజ్‌కల్లాలీలో మహిళలకు సన్మానం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్న మహిళల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. రాజకీయ, విద్య, వైద్య, శాస్త్ర పరిశోధన, గగనతలం ఇలా అన్ని రంగాల్లో మహిళలు ప్రతిభను చాటుతున్నారని గుర్తు చేశారు. దేశ మహిళలు విదేశాలలో ఉన్నత పదవులు అధిరోహిస్తూ దేశ కీర్తి ప్రతిష్టను పెంచుతున్నారని.. దేశ సర్వతోముఖాభివృద్ధిలో తమ పాత్రను పోషిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల మహిళలను సన్మానించారు.

జుక్కల్ : మండలంలోని క్రేమాజ్‌కల్లాలీ గ్రామంలో సర్పంచ్ రమేష్ దేశాయి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగ్‌వాడీ టీచర్లు, ఆశాలు, ఉపాధ్యాయునిలకు, వృద్ధ మహిళలకు గ్రామ పంచాయతీ పాలక వర్గం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ దేశాయి మాట్లాడుతూ గ్రామంలో మహిళలకు సముచిత స్థానం కల్పించామని అన్నారు. మహిళలపై వివక్ష లేకుండా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయవ్వ, అంగన్‌వాడీ టీచర్లు రాదా, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


మద్నూర్‌లో సన్మానించిన సర్పంచ్

మహిళలకు సన్మానం

మద్నూర్ : మద్నూర్ మండల కేంద్రంలోని పాలకవర్గంలోని మహిళలకు, అలాగే జీపీ పారిశుధ్య కార్మికులకు గ్రామ సర్పంచ్ సురేష్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. మహిళలు అంటే ఒక తల్లి ఒక అక్కా చెల్లెలు అనే విధంగా గౌరవిస్తూ వారిని మర్యాదగా పలకరించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా మహిళా మణులను గౌరవించాలని సూచించారు. ప్రతి పనిలో మహిళ లేనిదే ఏ పని జరగడం లేదని మహిళలు అంటే గౌరవంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విట్టల్ గ్రామ కార్యదర్శి సందీప్ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ చంద్రపాల్ పంచాయతీ సిబ్బంది మహిళా వార్డు సభ్యుల కుటుంబీకులు మహిళ వార్డు సభ్యులు మహిళా పారిశుద్ధ్య కార్మికులు పాల్గొని వారికి శాలువలతో ఘనంగా సత్కరించారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డోంగ్లి ప్రభుత్వ ఆస్పత్రిలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, తడి హిప్పర్గ సర్పంచ్ ప్రకాశ్ గైక్వాడ్, జిల్లా జనరల్ సెక్రెటరీ రైస్ ఖాన్, పార్టీ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

సదాశివనగర్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (మర్కల్)లో ప్రిన్సిపాల్ డా. వి. రాధిక ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. దీంట్లో భాగంగా వైస్ ప్రిన్సిపాల్ పి.మాణిక్య రేఖ మాట్లాడుతూ మహిళా సంఘ సంస్కర్తలు వివిధ రంగాల్లో మహిళలు సాధించిన ఘనతలను విద్యార్థులకు వివరించారు. జువాలజీ హెచ్‌వోడి కే. వనజ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఐక్యరాజ్య సమితి వారు అంతర్జాతీయ మహిళా దినోత్సవం కోసం ఇచ్చిన మోటో "సపోర్టింగ్ ఉమెన్ సపోర్ట్ "అనే విషయంపై వివరించారు.

మహిళా పోలీస్ అధికారులకు సన్మానం

సదాశివనగర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్ఐ ప్రమీల, కానిస్టేబుల్ లక్ష్మి, అలేఖ్యను సన్మానించారు. ఎస్ఐ రాజేశ్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు పోలీస్‌శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఏఎస్ఐ నర్సయ్య, సాగర్, జమేధార్ సాయులు, రామకృష్ణ, రైటర్లు శశికాంత్, నరేష్, హెూమ్ గార్డ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో సన్మానం

పిట్లం : పిట్లం మండల కేంద్రంలోని 8 మంది దళిత మహిళా ఉద్యోగులు తమ వృత్తిలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకుగాను మహిళ దినోత్సవం పురస్కరించుకొని బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

పిట్లం మండలంలోని మహిళా ప్రజా ప్రతినిధులతో పాటు , సామాజిక సేవకురాలు , మహిళా రైతును లైన్స్ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

సృష్టికి మూలం మహిళలేనని ఎస్సీ విజయ్‌కొండ అన్నారు. పిట్లం పోలీస్ స్టేషన్‌లో మహిళా సిబ్బంది పార్వతిని సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లింబాద్రి, బాలాజీ , మారుతి , సాయ గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం : ఎమ్మెల్యే జాజాల

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నియోజకవర్గ మహిళల లతో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాజల సురేందర్ మాట్లాడుతూ అభివృద్ధి లో మహిళ ల పాత్ర కీలకం అని అన్నారు. మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని దేశంలో మహిళల అభివృద్ధి వృద్ధి కోసం ఇలాంటి పథకాలు ఎక్కడ లేవని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విశదీకరించారు. అనంతరం మహిళలకు కానుకగా చీరలు అందజేసి వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకులు ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్, లింగంపేట్ ఎంపీపీ గారిబున్నీసా, గాంధారి ఎంపిపి, ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాజంపేట్ :మహిళా దినోత్సవం సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా రాజంపేట శాఖ ఆధ్వర్యంలో గురువారం శివాయిపల్లి రెడ్డి కళ్యాణ మండపంలో గ్రామ ఉప సర్పంచ్, రాజంపేట్ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు బక్కి సంధ్య అధ్యక్షతన మహిళలకు సన్మాన కార్యక్రమం నిర్వహించగా.. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు.


మర్కల్‌లోని డిగ్రీ గురుకులంలో..


పిట్లంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం..


రాజంపేట్‌లో..

10న జిల్లా మినీ జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-ఆర్మూర్

ఈ నెల 10న పట్టణంలోని సాంఘీక సంక్షేమ పాఠశాల బాలుర క్రీడా మైదానంలో మినీ-జూనియర్ (అండర్-12) బాల బాలికల సాఫ్ట్ బాల్ జిల్లాటోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, ప్రిన్సిపల్ దుర్గారెడ్డి బుధవారం తెలిపారు. ఈ టోర్నీలో పాల్గొనే క్రీడాకారులు 01,01, 2011 తర్వాత జన్మించి ఉండాలని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు నేడు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్ సాఫ్ట్ బాల్ అకాడమిక్ కోచ్ నరేష్‌కు రిపోర్ట్ చేయాలని తెలిపారు.

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

4

గురువారం 09 మార్చి 2023

అయిలపూర్ గ్రామ ముస్లిం కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నంది పేట్



మండలంలోని ఐలాపూర్ గ్రామంలో బుధవారం ముస్లిం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా షాదుల్లా, ఉపాధ్యక్షులుగా నసీరుద్దీన్, సభ్యులుగా మహబూబ్, యాసీన్, షరీఫ్, సాజిత్, అక్బర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా షాదుల్లా మాట్లాడుతూ.... తనపై నమ్మకంతో మైనార్టీ గ్రామ అధ్యక్షుడుగా ఎన్నుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో ఉన్న ముస్లిం మైనార్టీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర ఎనలేనిది

- ఘనంగా మహిళా దినోత్సవం
- మహిళలకు సన్మానం

మహిళ లేనిదే సృష్టి లేదని, మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని వక్తలు అన్నారు. సమాజంలో మహిళల పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. మహిళలు తలుచుకుంటే సాధ్య కానిది ఏదీ లేదని, ఒకప్పుడు వంటింటికే పరిమితమైన ఇంటిబాధ్యతలతోపాటు నాయకురాలిగా, అధికారిగా, ఉద్యోగిగా అన్ని బాధ్యతలు నిర్వహిస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో వివిధ రంగాల్లోని మహిళలను సన్మానించారు. ఈసందర్భంగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



నిజామాబాద్‌సిటీ : ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళా జర్నలిస్టులకు సన్మానం



ఆర్మూర్: జిల్లాకేంద్రంలో అంగన్‌వాడీలను సన్మానించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-విలేకరులు

నిజామాబాద్ రూరల్: సౌత్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్సై లింబాద్రి, సర్కిల్ పరిధిలోని మహిళా అధికారులకు సన్మానం చేశారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన మహిళా వార్డు సభ్యులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, ఐకెపి మహిళా సిబ్బంది, రెవెన్యూ మహిళా సిబ్బంది, గ్రామ పంచాయతీ మహిళ పారిశుధ్య సిబ్బందిని సత్కరించారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహనిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పారిశుధ్య సిబ్బందికి, అంగన్వాడి ఆయాలకు అందజేసిన చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ అధ్యక్షురాలు లోలప గౌతమి సుమన్, తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్: నిజామాబాద్ నగరంలోని ట్రాఫిక్ ఏసిపి నారాయణ, ట్రాఫిక్ సిఐ చందర్ రాథోడ్, ఎస్ఐలు ఏఎస్ఐలు కలిసి మహిళా కానిస్టేబుళ్లను ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో సన్మానించారు.

మహిళలు మగవారితో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు అన్నారు. లక్ష్మీ కళ్యాణ మండపంలో మహిళా పోలీస్ సిబ్బంది, కాలేజీ విద్యార్థులతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళల భద్రత కోసం నగరంలో త్వరలోనే భరోసా సెంటర్ అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ.. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న 33 శాతం రిజర్వేషన్ సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. జిల్లా పంచాయతి అధికారి డాక్టర్ జయసుధ మాట్లాడుతూ.. ప్రతీమహిళ ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొంటుందన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, పోలీస్ కార్యాలయం సిబ్బంది, మహిళ హోమ్ గార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నిజామాబాద్ వినాయక నగర్ లోని వైష్ణవి రెసిడెన్సీలో వివిధ రంగాలలో ప్రావీణ్యం గల మహిళలను సన్మానించారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

ముప్కాల్: మండలకేంద్రంలోని రైతు వేదిక సభ ప్రాంగణంలో ఎంపీపీ సామ పద్మ జడ్పీటీసీ సభ్యురాలు బద్దం నర్సవ్వలతోపాటు మండలంలోని మహిళా సర్పంచులను, ఎంపీటీసీ, ఉప సర్పంచులను, మహిళా ఉద్యోగులను, వివిధ రంగాల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ సెక్రటరీలను, అంగన్ వాడి, ఆశ వర్కర్లు, ఐకేపీ, పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి చీరలను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సైతం మహిళా దినోత్సవం నిర్వహించారు.

నిజామాబాద్‌సిటీ : జర్నలిజంలో మహిళలు రాణించాలని నగర మేయర్ నీతూ కిరణ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని సూచించారు. మహిళలు జర్నలిజంలో పోటీ పడుతుండటం అభినందనీయమని అన్నారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నగర మేయర్ నీతూ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నైతిక విలువలు కాపాడుతూ సమాజానికి మంచి వార్తలు అందించాలని చెప్పారు. మీడియా రంగంలో పనిచేస్తున్న పలువురు మహిళా జర్నలిస్టులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బైస సంగీత, పులగం లావణ్య, అనిత, శ్రీవాణిలను శాలువాతో సత్కరించారు. అనంతరం మేయర్ నీతూ కిరణ్‌ను మహిళా జర్నలిస్టులు సన్మానించారు.

ఆర్మూర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియల్ లో బుధవారం జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు అంగన్వాడి ఉద్యోగినులను సన్మానించినారు. పట్టణానికి చెందిన టీఎస్జీవో నాయకురాలు తార, అంగన్వాడి సూపర్వైజర్లు శ్రీదేవి, నళిని, అన్నపూర్ణ, వెంకటరమణమ్మ, వరలక్ష్మి ,సమత సునీత ఉషారాణిలను సన్మానించారు.

పట్టణంలోని యోగేశ్వర కాలనీజండా గల్లీలో జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్లో చైర్పర్సన్ పండిత్ వినీత పవన్, కౌన్సిలర్లు అల్జాపూర్ రేవతి, భాగ్య, అంగన్వాడి టీచర్ హేమలతలను సన్మానించినారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రకాష్, ప్రిన్సిపాల్ లత, మమత, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షులు చేపూర్ గణేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ పండిత్ వినీత పవన్ న్యాయస్థానంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ కోర్టు జడ్జి నసీమా సుల్తానా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీప్తిలను సన్మానించారు.

నలంద పాఠశాలం కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించి మెమొంటోని బహుకరించారు. అనంతరం కేక్ కట్‌చేశారు.

భీంగల్: మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్ సఫాయి కార్మికులు, ఆశ వర్కర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఇంచార్జీ కమీషనర్ రాజేంధర్, తహసీల్దార్ శ్రీధర్‌కుమార్, కౌన్సిలర్లు తదితరులున్నారు

బోధన్: ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాజేశ్వర్ మహిళ ఉద్యోగులను, సాలూర మండల తహసిల్దార్ మమతను సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ పాలన అధికారి ముంతాజుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు

నందిపేట్: బహుజన్ సమాజ్ పార్టీ మండల కమిటీ అధ్యక్షులు బొర్రోల్ల సురేష్ ఆధ్వర్యంలో శాపూర్ గ్రామంలో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్, గ్రామ మహిళా వార్డ్ సభ్యురాలు లను ఘనంగా సన్మానించారు. ఆర్మూర్ నియోజకవర్గం ఇంచార్జ్ కోమిరే సుధాకర్, కార్యక్రమంలో అసెంబ్లీ ఉపాధ్యక్షులు సుంకరి నాగరాజు, మండల కమిటీ జెనరల్ సెక్రటరీ బంటు రాజేశ్వర్, కార్యదరి మెట్టు నాగేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వర్ని: చందూర్ మండలం ఘనపూర్ గ్రామంలో సర్పంచ్ దాసరి గంగారం, పాత్రికేయులు ఇందూరు సాయిలు సమక్షంలో పంచాయతీ కార్మికురాలను సన్మానించారు.

బోధన్: సాలూర మండలంలో బిఎస్పి నాయకులు అంగన్వాడి, ఆశ వర్కర్లను శాలువా ,పూలమాలతో ఘనంగా సన్మానించారు. బోధన్ నియోజకవర్గ ఇన్చార్జ్ సింగర్ పాండు మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలకు చట్టసభల్లో 50శాతం రిర్వేషన్లు కల్పిస్తేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని అన్నారు. సాలూర మండల తహసీల్దార్ మమతను గ్రామ పెద్దలు సన్మానించారు.

పీఆర్టీయు ఆధ్వర్యంలో పట్టణంలోని పీఆర్టీయు భవన్‌లో మహిళా ఉపాధ్యాయులను ఉపాధ్యాయ నేతలు సన్మానించారు.

బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళ ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ లక్ష్మీ, విద్యా కమిటీ మహిళ సభ్యులను, మహిళ ఉపాధ్యాయులను, మధ్యాహ్న భోజన కార్మికులను గ్రామస్తులు సన్మానించారు.

అంతర్జాతీయ మహిళల దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమాను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మెన్ పద్మావతి

ఏర్గట్ల: మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి గ్రామపంచాయతీ మహిళా సిబ్బందికి, అంగన్వాడీ ఆయాలకు చీరలు పంపడంతో ఏర్గట్ల గ్రామపంచాయతీలో సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామంలో మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తేలు విజయ్ కుమార్, ఉప సర్పంచ్ నవిన్ గౌడ్ పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ సాయి కంప్యూటర్ కేంద్రంలో ఉపసర్పంచ్ న్యూలోఫర్ ఫాతిమాను నిర్వాహకులు రాణి సన్మానించారు.

మెండోరా: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంగన్వాడి ఆయాలు , పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం డిసిసిబి డైరెక్టర్ నాగంపేట్.శేఖర్ రెడ్డి , ప్రజాప్రతినిధుల సమక్షంలో ఎంపిపి బురుకల.సుకన్య కమలాకర్ మహిళలకు చీరలను అందజేశారు.

నిజామాబాద్ సిటీ : మహిళలు మహారాణులు అని జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు నరసింహులు గౌడ్ అన్నారు. నగరంలోని చంద్రశేఖర్ కాలనీలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాడెంట్ నారాగౌడ్ మాట్లాడుతూ తమ పాఠశాల లో అందరూ మహిళలే ఉన్నందుకు గర్వపడుతూన్నానని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లతనారాగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లులు పాల్గొన్నారు.

నవీపేట్: సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు ఏటీఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలో మహిళ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, అంగన్వాడి, ఆశ, పంచాయతీ కార్మికులకు టిఫిన్ బాక్సులను అందజేశారు.

ఎడపల్లి: మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కార్యాలయంలో ఎంఈవో రామారావు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులను సన్మానించారు.



కంఠేశ్వర్ మాట్లాడుతున్న సీపీ నాగరాజు



బోధన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే



నిజామాబాద్‌సిటీ : చంద్రశేఖర్ కాలనీలో..



కమ్మర్‌పల్లిలో..



నిజామాబాద్‌రూరల్ మండలంలో..



ముప్కాల్ మండలంలో..



మెండోరా మండలంలో..



నవీపేట మండలంలో..



నందిపేట్‌లో..



ఏర్గట్ల మండలంలో...



వర్ని: మహిళలనుసన్మానిస్తున్న సర్పంచ్

నవవధువుది ఆత్మహత్యే..

- కట్నంకోసం వేధించడంతోనే ఐదవ అంతస్తు నుంచి దూకి బలవన్మరణం.. భర్త అరెస్ట్, రిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అపార్ట్ మెంట్ ఐదవ అంతస్తు పై నుంచి దూకి నవవధువు ఆత్మహత్య చేసుకున్న ఘటనలో భర్త వేధింపులే కారణమని విచారణలో తేలడంతో భర్త విశాల్‌ను పోలీసులు బుధవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు మూడో టౌన్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. నిజామాబాద్‌జిల్లా కేంద్రంలోని మూడవ టౌన్ పరిధిలోని సుభాష్ నగర ప్రాంతంలో ఈనెల 2న నవవధువు పూర్ణిమ సుధా హైట్స్ అపార్ట్ మెంట్‌పై నుంచి దూకి మృతిచెందిన ఘటనపై పోలీసులు విచారించారు. రెండు నెలల క్రితం నగరానికి చెందిన పూర్ణిమకు, విశాల్‌తో వివాహం జరిగిందని, పూర్ణిమ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తుండగా, వర్క్ ఫ్రం హోం కావడంతో ఇంట్లోనే పని చేస్తోందని, భర్త విశాల్ బిల్డింగ్ కాంట్రాక్ట్ బిజినెస్ చేస్తున్నారని ఈ అపార్ట్ మెంట్లోనే అద్దెకు ఉంటున్నారని అన్నారు. కూతురి మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. పెళ్లి సమయంలో కట్నం ఇవ్వక పోవడంతోనే భర్త విశాల్, భార్య పూర్ణిమను వేధించే వాడని విచారణలో వెల్లడైందన్నారు. దీంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. అపార్ట్‌మెంట్‌లోని సీసీ ఫుటేజ్, చుట్టుపక్కల వారిని విచారించి ఆత్మహత్యగా గుర్తించామన్నారు. భర్తపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

మహిళలకు భూదేవికి ఉన్నంత ఓర్పు ఉంది

- ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-మోపాల్



వడ్డీ రాయితీ నిధులు విడుదల పత్రాలను అందజేస్తున్న బాజిరెడ్డి

మహిళలకు భూదేవికి ఉన్నంత ఓర్పు ఉంటుందని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ - మెప్మా ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల వడ్డీ రాయితీ నిధులను రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ పంపిణీ చేశారు. మండలంలోని బోర్గం గ్రామంలో ఉన్న మోటాటి రెడ్డి కళ్యాణ మండపంలో మహిళా దినోత్సవ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ. వ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతే ముఖ్యమంత్రి కేసిఆర్ మహిళలకు అధిక ప్రాధాన్యమిచ్చారని అని అన్నారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ డ్వాక్రా సంఘాల మహిళలకు వడ్డీ రాయితీ నిధులు విడుదల చేశారని తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళలకు వడ్డీ రాయితీ నిధులు విడుదల పత్రాలను మహిళా సంఘాలకు పంపిణీ చేశారు.అనంతరం రూరల్ నియోజకవర్గంలోని స్థానిక మహిళ జెడ్పిటిసిలు, ఎంపీపీలు, డ్వాక్రా మహిళలకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా యువ నాయకులు, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు ధర్పల్లి జెడ్పిటిసి జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్, ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్‌సాంబారి మోహన్ , ఆర్డిఓ రవి, తహసీల్దార్ శ్రీలత గారు, ఏ పి ఎం మోహన్, జడ్పిటిసి కమల నరేష్,, ఎంపీపీ లతా కన్నీరం, ఎన్ డి సి సి బి డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, అభిలాష్ రెడ్డి, ముత్యం రెడ్డి, కిషన్, లతా భూషణ్, ఇందూరు సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు

మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల వడ్డీ రాయితీ పట్ల హర్షం

- కేసీఆర్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటాలకు



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మహిళలు

పాలాభిషేకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల వడ్డీ రాయితీ నిదులను పంపిణీ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పంపిణీ చేయడం అభినందనీయమని బీఆర్ఎస్ ఇందల్ వాయి మండల మహిళా అధ్యక్షురాలు పులి వసంత అన్నారు. బుధవారం ఇందల్ వాయి మండలంలోని ఎల్లారెడ్డి పల్లి గ్రామంలో ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.కార్యక్రమంలో గ్రామ మహిళా అధ్యక్షురాలు చిలుక మమత, గజ గల గంగామణి, కవిత రాణి, మౌనిక, గ్రామ మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు

చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

ఐద్వా

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహిళా దినోత్సవ కానుకగా కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఐద్వానాయకులు డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారత ప్రజాతంత్ర సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఎస్టి గర్ల్స్ నాగారంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సబ్బని లత, కార్యదర్శి సుజాత మాట్లాడుతూ..

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో 33శాతం రిజర్వేషన్ బిల్లును అమలు చేసి మహిళలకు కానుకగా ఇవ్వాలని అన్నారు. మహిళలు దేశ భద్రతను కాపాడటంలో ముందున్నారని అన్నారు. రాజకీయ, వైద్య, పారిశ్రామికరంగాల్లో పైలెట్లుగా రాణిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం 1909 సంవత్సరం నుంచి జరుపుకోవడం ప్రారంభమైందని తెలిపారు. అమెరికాలో 1908లో ప్రారంభమైన కార్మిక ఉద్యమంలో దాదాపుగా 15వేల మంది మహిళలు తమ హక్కులను సాధించుకునేందకు న్యూయార్క్ వీధుల్లో ఉద్యమించి విజయం సాధించారని తెలిపారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా థీమ్ ఎంబ్రసీ ఈక్విటీ అంటే లింగ సమానత్వంపై దృష్టి సారిస్తుందని తెలిపారు. నేడు సమాజంలో మహిళలపై అనేక దాడులు పెరుగుతున్నాయని అన్నారు. మహిళల హక్కులను కాపాడాలని, మహిళా సాధికారత కోసం పాటుపడే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రియాంక, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



మహిళను సన్మానిస్తున్న ఐద్వానాయకులు